క్లుప్తంగా

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇస్తున్న వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదని దీంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. వీరికి కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి పీఎఫ్, ఈఎస్‌ఐ వంటివి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నగర కార్యదర్శి కెసీ బాదుల్లా, మద్దిలేటి పాల్గొన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించని కెమికల్ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర శివార్లలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలలో ఏ ఫ్యాక్టరీ కూడా పీఎఫ్, ఈఎస్‌ఐ కట్టడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి వారి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాలగిరి శివ, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన


ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: అక్రమ బదిలీలను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట అక్రమ బదిలీలు ఆపాలని, బదిలీ పొందిన ఉపాధ్యాయుల జీతాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో దొడ్డిదారి బదిలీలు అధికమయ్యామన్నారు. ఇటీవల 15 మందికి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయని మరి కొంతమంది బదిలీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. దీంతో సామాన్య ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, నాయకులు గోపీనాథ్, కిరణ్‌కుమార్, డేవిడ్ అబ్దుల్‌గనీ, జావిద్, శ్రీనివాసులు, కరీముల్లా, సుబ్బారావు, సిద్దయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైవీయూలో ర్యాలీ



ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

వైవీయూ : ర్యాగింగ్ రహిత విశ్వవిద్యాలయంగా వైవీయూను నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం వైవీయూలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాగింగ్ చేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎస్.పి. వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ జోన్ పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు, సహాయ కార్యదర్శి అంకన్నలు డిమాండ్ చేశారు. దీంతోపాటు ఇంటర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించాలని కోరారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ఆర్‌జేడీ రవిని కలిసి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకే

– మేయర్ కె. సురేష్ బాబు


49వ డివిజన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకే అందించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని కడప మేయర్ కె. సురేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో నిర్వహించిన జగనన్న సురక్ష లో ఆయన పాల్గొని, సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారికి మేలు చేకూరుస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తదితరాలకు సంబంధించి 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ ఇన్‌చార్జి మధువర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎం. సుబ్బారెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, బాదుల్లా, పెద్దన్న, యల్లారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వైపే దేశంలోని ఇతర రాష్ట్రాల సీఎంలు, మంత్రులు చూస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 4వ వార్డు, దేవరాజుపల్లె సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో లబ్ధిదారులకు ఆయన 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసి మాట్లాడారు. చంద్రబాబు వేల హామీలిచ్చి ఒక్కటి నెరవేర్చలేదన్నారు. తన 15 ఏళ్ల పాలనలో కేవలం 6 లక్షల గృహాలు నిర్మించారని గుర్తు చేశారు. జగనన్న 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చి 15 లక్షల గృహాలు నిర్మిస్తున్నాడన్నారు. జగనన్న పాలనకు, చంద్రబాబు పాలనకు ఎంత తేడా ఉందో గమనించాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్‌సీ బోర్డు మెంబర్ నిమ్మకాయల సుధాకర్ రెడ్డి, స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మార్పురి మేరి, రాజారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కొండారెడ్డి, హిదాయత్, నిఖిల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఏడీఏ నరసింహారెడ్డి, ఎంపీడీఓ చలపతి, తహసీల్దార్ సరస్వతి పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండల పరిధిలోని కోట్లూరు గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరోనాతో ఆదాయం లేక పోయినప్పటికీ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సీఎం జగన్ ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలను మంజూరు చేయడానికి అవసరమైన సర్టిఫికెట్లను ప్రజల ఇంటి ముంగిటనే ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఏవో సాయిజ్యోతి, ఏపీఎం శైలజ, ఎంఈవో లిల్లెమ్మ, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు నాగిరెడ్డి, పుల్లయ్య ఏసయ్య, మస్తాన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : కొమ్మద్ది సచివాలయంలో గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. సర్వరాయసాగర్ ప్రాజెక్టును పూర్తిచేసి వీరపునాయునిపల్లె మండ ప్రజలకు కానుకగా అందించాలన్నదే వైఎస్‌ఆర్ ఆశయమని అటువంటి ప్రాజెక్టు కొమ్మద్ది గ్రామానికి అతి సమీపంలో రావడం ఒక వరం అన్నారు. అతి త్వరలో పంట కాలువలు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.


కమలాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సలీంబాషా

– నేడు బాధ్యతల స్వీకరణ
– డా. పి. సుబ్బులక్షుమ్మ ఉదయగిరికి బదిలీ



వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేమల సలీంబాషా నియమితులయ్యారు. తాజాగా నిర్వహించిన బదిలీల్లో శ్రీకాకుళం జిల్లా బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డా. వి. సలీంబాషాను కడప కోటిరెడ్డి కళాశాలకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ పి. సుబ్బులక్షుమ్మను అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. కాగా డా. వేమల సలీంబాషా స్వస్థలం ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరి.
ఈయన విద్యాభ్యాసం అంతా అనంతపురం జిల్లాలోనే సాగింది. ఇంటర్ కదిరిలోను, డిగ్రీ అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పీజీ, పీహెచ్‌డీ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. 2001లో జూనియర్ లెక్చరర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన 2006లో డిగ్రీ లెక్చరర్‌గా పదోన్నతి పొందిన ఆయన సుదీర్ఘకాలం అనంతపురం జిల్లాలోని పలు కళాశాలల్లో కెమిస్ట్రీ అధ్యాపకుడుగా పనిచేశారు.
2021 అక్టోబర్‌లో నిర్వహించిన పదోన్నతుల్లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది శ్రీకాకుళం జిల్లా బారువ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 11వ తేదీన నిర్వహించిన స్వయంప్రతిపత్తి కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇంటర్వ్యూలో ఈయన్ను కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.



ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేశారు

2020–21లో కోవిడ్ వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వలంటీర్ల ద్వారా పేదలకు వెయ్యి రూపాయలు ఆర్థిక సాయంతోపాటు పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆపద వేళలో పేదలకు ఆపన్న హస్తంలా వలంటీర్లు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి పింఛన్లు, కూరగాయలు, బియ్యం అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో ఉన్నవారికి సైతం వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్లు అందించారు. లాక్‌డౌన్ సమయంలో వలంటీర్ల సేవలకు ప్రజలు సలాం కొట్టారు.

– కడప కార్పొరేషన్


అమీనా బీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గాయత్రి

వ్యాక్సిన్లు వేయించడం వల్ల కరోనా రాలేదు



రెండేళ్లక్రితం ఉన్న ఫలంగా లాక్‌డౌన్ పెట్టారు. డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందిగా ఉండేది. మా ఏరియా వాలంటీర్ గాయత్రి ఉదయమే తలుపు తట్టి నాకు పింఛన్ ఇచ్చేది. దాతలు ఇచ్చిన కూరగాయలు, బియ్యం, భోజన ప్యాకెట్లను మా ఇంటికే తెచ్చి ఇచ్చేది. కరోనా నివారణకు మూడు వ్యాక్సిన్లు ఆమె వేయించింది, అందుకే నాకు కరోనా సోకలేదు.

– అమీనా బీ, ఏపీహెచ్‌బీ కాలనీ, కడప

వరదలు వచ్చినపుడు ఆదుకున్నారు

2020లో కడపలో కురిసిన భారీ వర్షాల వల్ల బుగ్గవంకకు వరద వచ్చింది. కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీటమునిగాయి. ఏపీహెచ్‌బీ కాలనీ, ప్రకాష్ నగర్ లలో భారీ ఎత్తున నీరు నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నీట మునిగిన వారికి ఆర్థిక సాయం అందించింది. మూడు నెలలు బియ్యం ఉచితంగా ఇచ్చారు. దాతలు కూడా సాయం చేశారు. వీటిని వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. మోకాలి లోతు నీటిలో ప్రతి ఇంటికీ వెళ్లి బియ్యం, ఆహార ప్యాకెట్లు పంచడమేగాక, సంక్షేమ పథకాలను గడప వద్దకే చేర్చారు.

– కడప కార్పొరేషన్


వరదల్లో ఇంటింటికీ సేవలందిస్తున్న వలంటీర్ హేమంత్ (ఫైల్)

మోకాలి లోతు నీటిలో వచ్చి సాయం అందించాడు



గతంలో వరదలు వచ్చినప్పుడు కడపలో చాలా ప్రాంతాలు నీట మునిగాయి. ప్రకాష్‌నగర్ అంతా నీట మునిగిపోయింది. చాలా ఇళ్లలోకి నీరు వచ్చింది. అప్పుడు మా ఏరియా వలంటీర్ హేమంత్ వరదనీటిలోనే మా ఇంటికి వచ్చి బియ్యం, సరుకులు, కూరగాయలు ఇచ్చాడు. ప్రతినెలా తెల్లవారుజామునే తలుపుతట్టి ఠంఛన్‌గా పింఛన్ ఇచ్చేవాడు. ఎప్పుడు కనబడినా అవ్వా..బాగున్నావా అని ఆప్యాయంగా పలకరిస్తాడు.

– ఎం. మునెమ్మ, ప్రకాష్‌నగర్, కడప

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

కడప కల్చరల్ : కడప నగరం కొత్త కలెక్టరేట్ కూడలిలోగల శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి మందిరంలో ఆడికృత్తిక ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5.00 గంటల నుంచి ఆలయంలో విశేష పూజలు ప్రారంభించారు. నగరం మధ్య గల ఆలయం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున పూజలకు హాజరయ్యారు. సాయంత్రం విశేష పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు. ఆ ప్రాంతమంతా భక్తులతో సందడిగా మారింది. చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సుబ్రమణ్యస్వామికి ఆడికృత్తిక సందర్భంగా విశేష ఉత్సవం నిర్వహించారు. ఉదయం 7.00 గంటల నుంచి విశేష పూజలు, పలు రకాల హోమాలు నిర్వహిచారు.

చిట్వేలిలో..

చిట్వేలి : కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని స్థానిక అమ్మవారిశాలలో సోమేశ్వర ఆలయంలో సుబ్రమణ్యస్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం ఉదయం అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి శాలలో సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం సుబ్రమణ్యస్వామి వారికి మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

రెడ్ల ఐక్యత సభను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : ఆగస్టు 6న విజయవాడలోని భవానిపురంలో కొండవీటి రెడ్డి భవనంలో నిర్వహించనున్న రెడ్ల ఐక్యత సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ప్రొద్దుటూరు పట్టణంలోని పలువురు ముఖ్యులను కలిశారు. రెడ్డి కార్పొరేషన్ ద్వారా యువతకు సబ్సిడీ రుణాలు, వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, సుదీర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జీవనజ్యోతి, టీవీఆర్ కరస్పాండెంట్లు అమరనాథ్‌రెడ్డి, వైవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

బాలికలు అన్ని అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మంచి, చెడు స్పర్శల పట్ల బాలికలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా స్త్రీ , శిశు సంక్షేమ సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కొండాయపల్లెలోని మండల ప్రజా పరిషత్ స్కూలులో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, శుభ్రత పరిశుభ్రత, రక్షణ పరమైన సమస్యలు ఎదురైనప్పుడు ఎవరిని సంప్రదించాలనే విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఇందులో భాగంగా బాలలకు ఇష్టమైన యానిమేషన్ రూపంలో ఉన్న తెలుగు అనువాదంలో కోమల్ వీడియోని ప్రదర్శించారు. ఈ వీడియోలో మంచి స్పర్శ, చెడు స్పర్శ, గురించి బాలలకు అర్థమయ్యే విధంగా ప్రదర్శించారు. వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి సరిత కుమారి మాట్లాడుతూ బాల బాలికలు సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1098 కాల్ చేసి మీ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీసీ చెన్నయ్య, ఎడ్యుకేషనల్ సెక్రటరీ కె.చంద్ర శేఖర్, శిశుగృహ సామాజిక కార్యకర్త పద్మిని, స్కూల్ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న వినోద్‌కుమార్

పవిత్ర ఖురాన్ దహనం దారుణం

కడప కల్చరల్ : పవిత్ర ఖురాన్‌ను దహనం చేయడం అత్యంత దారుణమని, దీనిని అందరూ ఖండించాలని ఆంధ్రప్రదేశ్ ఉలేమా అయిమ్మ కమిటీ సభ్యులు అన్నారు. గురువారం కడప నగరంలోని సంస్థ కార్యాలయంలో నగరానికి చెందిన పలువురు ముస్లిం ప్రముఖులు ఈ అంశం పట్ల తమ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. గతంలో కూడా స్వీడన్‌లో ఇలాంటి ఘటనలు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం ఓ వ్యక్తి బహిరంగంగా ఈ దారుణానికి ఒడిగట్టడం సహించరానిదన్నారు. పాశ్చాత్యదేశాలలో ఇస్లాంకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇస్లాం ప్రకృతి ధర్మమని, శాంతికి చిహ్నమని, విశ్వవ్యాప్తంగా ఉందన్నారు. ఈ ఘటనను దేశాధినేతలందరూ ఖండించాలని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఉలేమా అయిమ్మ కమిటీ సభ్యులు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూనిఫాం సివిల్ కోడ్‌ను ముక్తకంఠంతో ఖండించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

సిటీ ఫారెస్ట్‌ను పరిశీలించిన పాడా ఓఎస్డీ

పులివెందుల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన ప్రారంభించిన సిటీ ఫారెస్ట్ రాణితోపు, గరండాల్ రివర్ ఫ్రంట్ ప్రాంతాలను గురువారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిటీ ఫారెస్ట్ రాణితోపు, గరండాల్ రివర్ ఫ్రంట్ ప్రాంతాలలో నిర్వహించే దుకాణదారులతో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరవనంలో నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయాలలో ఏ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.. వాటిపైన ముఖ్యంగా పెట్టిన షాపింగ్ మరొక షాపు పెట్టకూడదన్నారు. అలాగే ఎంట్రెన్స్ రుసుం చెల్లించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రవేశ రుసుం రూ.20లు, బోటింగ్‌కు రూ.50లు, వాకర్స్‌కు నెలకు రూ.300లుగా నిర్ణయించారు. నగరవనంలోని 15 షాపులను కూడా అందుబాటులోకి తీసుకరావాలని కోరారు. సిటీ ఫారెస్ట్‌లో మొత్తం పురపాలక సంఘం నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేయాలన్నారు. నగరవనంలో నో స్మోకింగ్ ఏరియాగా తీర్చిద్దాలని తెలిపారు. మూడేళ్లలోపు పిల్లలకు ఎలాంటి ప్రవేశ రుసుం ఉండదన్నారు. వాకింగ్, సైక్లింగ్, హార్స్ రైడింగ్, యోగా, బోటింగ్ తదితర వాటికి నెల పాసులు అందుబాటులో ఉంటాయన్నారు. వాటికి సంబంధించిన వివరాలను సిటీ ఫారెస్ట్ ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించాలని అధికారులకు ఓఎస్డీ సూచించారు. వీటికి సంబంధించిన అన్ని రుసుములు ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ రూపంలో మాత్రమే స్వీకరిస్తారని, నగదు రూపంలో ఉండవని చెప్పారు. వీటికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకుని ఆదివారం నాటికి నగర ప్రజలకు సిటీ ఫారెస్ట్‌ను అందుబాటులోకి వచ్చేలా అధికారులు సిద్ధం చేసుకావాలని కోరారు.


సిటీ ఫారెస్ట్ నిర్వహణ గురించి చర్చిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

సాంకేతికతతో విద్యను బోధించండి

రాయచోటి టౌన్ : విద్యార్థులకు సాంకేతికతను జోడించి విద్యను బోధించాలని డైట్ వైస్ ప్రిన్సిపల్ శివభాస్కర్ చెప్పారు. డైట్ కేంద్రంలో మ్యాజిక్ బస్, ఎస్‌సీఈఆర్‌టీ వారి ఆధ్వర్యంలో పీఈటీ, పీడీలకు గురువారం నుంచి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జీవన వైవిధ్యంపై అవగాహన కల్పించేందుకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతికతో పాటు నైపుణ్యం జోడించి విద్యార్థులకు విజ్ఞానాన్ని నేర్పాలని చెప్పారు. కార్యక్రమానికి మానిటరింగ్ అధికారిగా డీఈఓ శ్రీరాం పురుషోత్తం వ్యవహరించారు. పీఈటీ టీచర్ల సంఘం నాయకులు రమేష్ బాబు, వీరాంజనేయులు, రెడ్డయ్య, వెంకటరాజు, జగదీశ్వరయ్య, లలితమ్మ, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని 3వ సచివాలయంలో, అలాగే ఎర్రగుడిపాడులో శుక్రవారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఎంపీడీఓ చలపతి గురువారం వేరు వేరు ప్రకటనల్లో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు తెలిపారు. లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.

నేడు పైడికాలువలో జగనన్న సురక్ష

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని పైడికాలువ గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందచేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

పోరాటంలో ముందుండాలి

కడప ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమ పోరాటాల్లో నగర కమిటి సభ్యులు ముందుండాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. గురువారం కడపలోని పీఎస్‌యూ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సమస్యలపై చర్చించారు. అనంతరం కడప నగర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో నగర అధ్యక్షులుగా ప్రేమ్ కుమార్, కార్యదర్శిగా నరసింహా, ఉపాధ్యక్షులుగా తరణ్, కేశవ్, ఆకాష్, సహాయ కార్యదర్శులుగా భాగ్యరాజు, నాని, సభ్యులుగా నాగరాజు, గౌతమి, వినోద్‌కుమార్, ఓబులయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జీపీఎస్ అమలుకు పూనుకోవడం అన్యాయం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర కేబినెట్ జీపీఎస్ అమలుకు ఆమోదం తెలపడంతో ఉద్యోగుల ఆశలు అడియాశలు అయ్యాయని ఏపీ సీపీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎస్సార్ వెంకట జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సీపీఎస్ వలన ఉద్యోగులకు ఎంతోమేలు చేకూరుతుందన్నారు. జీపీఎస్ పద్ధతిలో ఉద్యోగులు నష్టపోతారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

బీఎస్ రావు మృతి తీరనిలోటు


బీఎస్ రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏజీఎం రమణయ్య

కడప ఎడ్యుకేషన్: శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ బీఎస్ రావు మృతి సమాజానికి తీరని లోటని శ్రీ చైతన్య ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా ఏజీఎం రమణయ్య పేర్కొన్నారు. గురువారం కడప రాజీవ్‌పార్కు వద్ద ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో బీఎస్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఏజీఎంతోపాటు పాఠశాల సిబ్బంది సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ రావు శ్రీచైతన్య విద్యాసంస్థలను స్థాపించి దేశవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఎస్‌లుగా, ఐపీఎస్‌లుగా సమాజానికి అందించారన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థలు కీర్తిని భారతదేశానికి పరిచయం చేసిన గొప్ప విద్యా ప్రదాత అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.